ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY



చిత్తూరు
జిల్లా వార్తలు

బుధవారం 11 డిసెంబరు 2024



పడమటి సూరీడు

అస్తమిస్తున్న రవి కిరణాలను పొగమంచు కమ్ముకుంది.చిత్తూరులోని గిరింపేట సమీపంలో వున్న గంగినేని చెరువు వద్ద మంగళవారం సాయంత్రం కన్పించిన దృశ్యమిది.

ఊరిస్తున్న ఛైర్మన్ పోస్టులు

● మార్కెట్ కమిటీల నియామకానికి వేళాయె ● జిల్లా యూనిట్‌గా ఖరారు కానున్న రిజర్వేషన్లు

చిత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విడతల వారీగా నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించేందుకు కసరత్తు చేస్తోంది.మార్కెట్ కమిటీల ఛైర్మన్ల కోసం జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్ ఖరారు చేయాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్లకు ఆదేశాలందాయి. జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలు.. ఇలా అన్ని వర్గాలు ఉండేలా రూల్ ఆఫ్ రిజర్వేషన్లను నిర్ణయించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. దీంతో ఇప్పటివరకు విడుదల చేసిన నామినేటెడ్ జాబితాల్లో పేర్లు లేనివారంతా ఈ ఛైర్మన్ పోస్టుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పుంగనూరు, సోమల, రొంపిచెర్ల, పెనుమూరు, ఎస్‌ఆర్‌పురం, కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, చిత్తూరు, నగరి ప్రాంతాల్లో మార్కెట్ కమిటీలున్నాయి. వీటిలో జిల్లా విభజన తర్వాత రొంపిచెర్ల, ఎస్‌ఆర్ పురం మార్కెట్ కమిటీలను గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసింది.



- పుంగనూరు నియోజకవర్గంలో మొత్తం మూడు కమిటీలున్నాయి. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు పుంగనూరు కమిటీకి ఎవరి పేర్లనూ ప్రభుత్వానికి సిఫార్సు చేయకపోవడంతో ఛైర్మన్ పదవిని భర్తీ చేయలేదు. సోమల కమిటీ ఛైర్మన్‌గా సదుం మండలానికి చెందిన రసూల్ బాషా, ప్రభునాథరెడ్డి పనిచేశారు. గత వైసీపీ ప్రభుత్వం రొంపిచెర్ల కమిటీని కొత్తగా ఏర్పాటుచేసి, తమ పార్టీ నాయకుల్ని ఛైర్మన్లుగా నియమించుకుంది. ప్రస్తుతానికి పుంగనూరు కమిటీ ఛైర్మన్‌గా సమీపతి పేరు ఖరారైనట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.
- కుప్పం నియోజకవర్గంలో కుప్పం మార్కెట్ కమిటీ ఒకటే ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సత్యేంద్రశేఖర్, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ ఛైర్మన్లుగా పనిచేశారు. ప్రస్తుతం వారిద్దరూ మళ్లీ ప్రయత్నిస్తున్నారు.వీరితో పాటు గుడుపల్లె మాజీ ఎంపీపీ, వన్నియకుల క్షత్రియ నేత జీఎం రాజు, యువనేత చెక్కునత్తం మణితో పాటు సుమారు పదిమంది పోటీ పడుతున్నారు.
- పలమనేరు నియోజకవర్గంలో కూడా పలమనేరు కమిటీ ఒకటే ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీనివాసులురెడ్డి, హేమంత్‌రెడ్డి, రామచంద్ర నాయుడు ఛైర్మన్లుగా పనిచేశారు. ఒకవేళ ఎస్సీలకు రిజర్వేషన్ కేటాయిస్తే పలమనేరు పట్టణ జనరల్ సెక్రటరీ గిరిబాబుకు, ఓసీ అయితే మళ్లీ వి.కోట మండలానికి చెందిన రామచంద్ర నాయుడికి అవకాశం ఉండొచ్చని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.
- జీడీనెల్లూరు నియోజకవర్గంలో పెనుమూరు, ఎస్‌ఆర్‌పురం కమిటీలుండగా.. ఎస్‌ఆర్‌పురం వైసీపీ హయాంలో కొత్తగా ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెనుమూరు కమిటీ ఛైర్మన్‌గా మోహన్ నాయుడు పనిచేశారు. ఎస్‌ఆర్ పురం కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే థామస్‌కు సన్నిహితుడు, టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండయ్య పేరును ఎమ్మెల్యే ఖరారు చేసినట్లు వినిపిస్తోంది. పెనుమూరు కమిటీ ఛైర్మన్‌గా జీడీనెల్లూరుకు చెందిన సెల్‌కాన్ మొబైల్స్ ఎండీ అన్న కృష్ణమ నాయుడి పేరు వినిపిస్తోంది.
- చిత్తూరు నియోజకవర్గంలో జిల్లా కేంద్రంలోని కమిటీ ఒకటే ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాపాక్షి మోహన్ సుదీర్ఘకాలం పాటు పనిచేయగా, కాజూరు బాలాజీ చివర్లో కొంతకాలం పనిచేశారు. ఇప్పుడు ఎమ్మెల్యే పదవి కమ్మ వర్గానికి, చుడా ఛైర్మన్ పదవి బలిజ వర్గానికి కేటాయించడంతో పాటు వన్నియకుల క్షత్రియ ఛైర్మన్ పోస్టు కూడా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికే దక్కింది. ఈ క్రమంలో చిత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పోస్టు ఈసారి బీసీ వర్గాలకు దక్కుతుందనే చర్చ జరుగుతోంది. మాపాక్షికి చెందిన వెంకటేష్ యాదవ్‌కు ఎమ్మెల్యే మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా కొందరు నేరుగా అధిష్ఠాన వర్గాలతో ప్రయత్నం చేసుకుంటున్నట్లు సమాచారం.
- పూతలపట్టు నియోజకవర్గానికి బంగారుపాళ్యంలో ఓ కమిటీ ఉంది. టీడీపీ హయాంలో బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెకు చెందిన ఎన్‌పీ జయచంద్ర నాయుడు ఐదేళ్ల పాటు ఛైర్మన్‌గా కొనసాగారు. ప్రస్తుతం తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పోటీపడుతున్నారు.
- నగరి నియోజకవర్గంలో నగరి, పుత్తూరు కమిటీలుండగా.. పుత్తూరు తిరుపతి జిల్లా పరిధిలోకి వెళుతుంది.2014-19మధ్యకాలంలో అప్పటి టీడీపీ ఇన్‌ఛార్జి,ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ నాయుడు ఎవర్నీ సిఫార్సు చేయకపోవడంతో ఛైర్మన్ పోస్టు భర్తీ చేయలేదు.

స్కూళ్లకు ఆలస్యంగా వచ్చే టీచర్లపై చర్యలుంటాయ్

● సమ్మేటివ్- 1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్న డీఈవో వరలక్ష్మి



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'విద్యాబుద్ధులు నేర్పించాల్సిన టీచర్లే బడికి ఆలస్యంగా వెళితే పిల్లలకు ఏం క్రమశిక్షణ అలవాటు చేస్తారు? కాబట్టి ఎక్కడైనా టీచర్లు ఆలస్యంగా బడికి వెళ్లినట్లు తెలిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం' అని డీఈవో వరలక్ష్మి చెప్పారు. డీఈవోగా బాధ్యతలు చేపట్టాక ఈ నెల రోజుల్లో జిల్లా విద్యా వ్యవస్థలో గుర్తించిన లోపాలు, సరిచేయాల్సిన అంశాల గురించి మంగళవారం ఆమె తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు.విద్యాశాఖపరంగా ప్రజాప్రతినిధులను గౌరవిస్తున్నామని, గత నెలాఖరు వరకు ప్రజాప్రతినిధులు నా దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించామన్నారు.ఈ నెలలో ఒక్క అంశం మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు.సర్దుబాటు సరిగా చేయకపోవడంతో జిల్లాలో అక్కడక్కడా టీచర్ల కొరత కనిపిస్తోందన్న ఆమె 311మంది ఉపాధ్యాయులు అదనంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. త్వరలోనే సర్దుబాటు ప్రక్రియ మొదలెడతామన్నారు.తన పరిశీలనలో ప్రాథమిక పాఠశాలల్లో అభ్యసనా సామర్థ్యాలు చాలా తక్కువగా ఉన్నాయని ప్రణాళికాబద్ధంగా మెరుగుపరుస్తామన్నారు.బుధవారం నుంచి 19వ తేదీ వరకు జరిగే సమ్మెటివ్- 1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు.వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించమని సబ్జెక్టు టీచర్లకు సూచించామన్నారు.స్కూళ్లలో మధ్యాహ్న భోజనం మెనూ సరిగ్గానే వున్నా నిర్వహణ లోపం కన్పిస్తోందన్నారు. వంటగదుల్లో శుభ్రత కరువైందని, దీన్ని సరిచేయడంపై దృష్టి సారించామన్నారు.

ఊపందుకున్న రెవెన్యూ సదస్సులు



పెనుమూరు మండలం కలవగుంటలో జరిగిన సదస్సులో డిప్యూటీ కలెక్టర్ వెంకటకృష్ణ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు స్పందన పెరుగుతోంది. మంగళవారం 43 రెవెన్యూ గ్రామాల్లో జరిగిన సదస్సులకు 660 ఫిర్యాదులందాయి. ఈ నెల 6వ తేది నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభంకాగా ఆదివారం సెలవుకావడంతో జరగలేదు. మంగళవారం నాటి సదస్సులతో కలిపి ఇప్పటి వరకు 88 గ్రామాల్లో నిర్వహించగా మొత్తం 2001 ఫిర్యాదులందాయి. మంగళవారం అందిన ఫిర్యాదుల్లో ఆర్‌వోఆర్ పట్టాలకు సంబంధించి 341 , ప్రభుత్వ భూముల ఎంక్రోచ్‌మెంట్‌కు సంబంధించి 13, ఇళ్ల పట్టాల అసైన్‌మెంట్‌పై 49, పీవోటీపై 23, 22ఏ తొలగింపులు, సర్దుబాట్లపై 14, రీ సర్వేపై 21, సచివాలయాలపై 28, ఇతరత్రా అంశాలపై 124 ఫిర్యాదులందాయి.

పల్లెల్లో ఎన్నికల సందడి



220 సాగునీటి సంఘాల ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ !

చిత్తూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :వివిధ కారణాలతో రెండు సార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. జలవనరుల సంరక్షణకు గత టీడీపీ పాలనలో సాగునీటి సంఘాలుండేవి. వీటిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలవనరులకు పూర్వవైభవం రానుంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలి సారి పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొననుంది. జిల్లాలో 220 సాగునీటి వినియోదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల జాబితా తయారీ నుంచి పోలింగ్ ప్రక్రియ దాకా 40 రోజుల్లో ముగించేలా జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు దృష్టి సారించారు. రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే సాగునీటి వినియోగదారుల సంఘాలు 2003లో ఆవిర్భవించాయి.చివరిసారి 2015లో వీటికి ఎన్నికలు జరగ్గా 2020తో కాలపరిమితి ముగిసింది. ఆపై అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో చెరువులు, మీడియం ప్రాజెక్టుల నిర్వహణ అటకెక్కింది. చెరువులు, ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు పూర్తిగా ఆగిపోవడంతో వీటికి ప్రస్తుతం నీరు చేరే పరిస్థితి లేదు. ఈ కారణంగా వర్షాలు సమృద్ధిగా కురిసినా పంటల సాగుకు నీరందడంలేదు. ఈ క్రమంలో సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తామని కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హామీ అమలు దిశగా చర్యలు ప్రారంభించారు.

సమగ్ర సమాచారంతో కలెక్టర్ల సదస్సుకు



అధికారులతో నోట్స్ తయారీపై చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు/చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధ, గురువారాల్లో జరగనున్న కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ బయల్దేరి వెళ్లారు. అంతకుముందు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో నోట్స్ తయారీపై చర్చించారు.ఆర్టీజీఎస్, గ్రీవెన్స్, సచివాలయాలు, వాట్సప్ గవర్నెన్స్, వ్యవసాయ అనుబంధ రంగాలు, జలవనరుల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల,సెర్ప్, పట్టణాభివృద్ధి, శాంతి భద్రతల గురించి జిల్లాస్థాయిలో తయారుచేసిన నోట్స్ తీసుకువెళ్లారు.అలాగే పరిశ్రమలు, ఐటీ, పెట్టుబడులు, విద్యుత్, మానవ వనరుల అభివృద్ధి, రహదారులు, భవనాలు, గృహ నిర్మాణం, సాంఘిక, గిరిజన, బీసీ, మైనార్టీ, ఐసీడీఎస్, రెవెన్యూ, మైన్స్, జిల్లాస్థాయి అభివృద్ధి ప్రణాళిక అంశాలపై జరగనున్న చర్చకు సంబంధించిన నోట్స్‌ను కలెక్టర్ తీసుకెళ్లారు.వీటిలో ముఖ్యమైనవి...

- జిల్లాలో 152,868మంది డేటా మిస్సయినట్లు గుర్తించగా.. సచివాలయ ఉద్యోగులు జనవరి ఆఖరుకల్లా వారిని గుర్తించాల్సి ఉంది. ఇప్పటివరకు 9289మంది వివరాలను గుర్తించారు. ఇంకా 143579 మందికి చెందిన వివరాలను గుర్తించాల్సి ఉంది.● 214,937 మంది బ్యాంకు ఖాతాలు ఎన్‌పీసీఐతో లింక్ అవ్వాల్సి ఉండగా.. ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఇప్పటివరకు 98.48 శాతం, అంటే 211,680 మంది ఖాతాలను లింక్ చేశారు. ఈ నెల 15లోగా లింకింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.● 592,343 గృహాలకుగానూ 95.77 శాతం, అంటే 567,307 గృహాలను జియోట్యాగింగ్ చేశారు. మిగిలిన ప్రక్రియ ఈ నెల 15లోగా పూర్తి చేయాల్సి ఉంది.● 27,859 మంది ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ కార్డులు లేవని గుర్తించగా.. 3656 మంది ఎన్‌రోల్ చేసుకున్నారు.● ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రబీ పంటల్ని ఎన్‌రోల్ చేయడానికి జిల్లాలో 9432 హెక్టార్లను గుర్తించారు. 9వ తేదీ నాటికి వీటిలో 71 హెక్టార్లను మాత్రమే ఎన్‌రోల్ చేశారు. ●37 అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీలకుగానూ (ప్యాక్స్) 2 చోట్ల మాత్రమే పూర్తి స్థాయిలో రికార్డుల్ని ఆన్‌లైన్ చేశారు.●2041 గోకులం షెడ్లను మంజూరు చేయగా.. 1824 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 153 పూర్తయ్యాయి. అలాగే 1356 కిలోమీటర్ల సీసీ రోడ్లకుగానూ 421 రోడ్లు పూర్తయ్యాయి.● ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.201 కోట్ల ఉపాధిహామీ మెటీరియల్ కాంపొనెంట్ వాడాల్సి ఉండగా.. రూ.81.73 కోట్లు మాత్రమే ఉపయోగించారు.

'రోడ్డు'పైకి టీడీఆర్ అవినీతి!

● తిరుపతిలో పది బృందాలతో సమగ్ర విచారణ

● బాండ్ల విలువపై క్షుణ్ణంగా పరిశీలన



తిరుపతి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలుగుచూసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల అవినీతి వ్యవహారం రోడ్డుపైకి వచ్చింది. వైసీపీ హయాంలో వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వెంబడి పది ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ఇంటింటికీ వెళుతున్నాయి. రోడ్డుకు నష్టపోయిన స్థలమెంత? టీడీఆర్ బాండు విలువెంత? అన్న కోణంలో విచారిస్తున్నాయి. ఎన్నికల వేళ మాస్టర్ ప్లాన్ రోడ్లనే ఐకాన్‌గా చూపించిన వైసీపీ పెద్దలకు టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అవకతవకల ఉచ్చు బిగుస్తోంది. కూటమి అధికారంలోకి రాగానే టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. డీఎంఏకు చేరిన నివేదికపై ప్రభుత్వ పెద్దలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దీంతో రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలకు చెందిన పది మంది టౌన్ ప్లానింగ్ అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లమని రాష్ట్రప్రభుత్వ టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఆదేశాలు జారీ చేశారు. తిరుపతికి చేరుకున్న ఆ పది మంది అధికారుల్లో.. ఒక్కొక్కరికి ముగ్గురు చొప్పున తిరుపతి టౌన్ ప్లానింగ్ సెక్రటరీలను కేటాయించారు. ఒక్కో బృందానికి 40 నుంచి 45 టీడీఆర్ బాండ్లను అప్పగించి రోడ్డుకు ఒకరు చొప్పున డోర్‌డోర్ పరిశీలిస్తున్నారు.

సీఐడీ దూకుడు

మరోవైపు సీఐడీ అధికారులూ దూకుడు పెంచారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిధిలో టీడీఆర్ బాండ్లు పొంది అనుమానంగా ఉన్న కొన్ని డోర్ నెంబర్ల జాబితాను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులకు వీరు ఇచ్చినట్టు తెలిసింది. వాటికి పన్నులు వేశారా? వేసుంటే ఎంతవేశారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో సీఐడీ వాళ్లు ఇచ్చిన జాబితాలో కొన్ని డోర్ నెంబర్లు రెవెన్యూ విభాగంలో లేనట్టు తెలుస్తోంది. ఈ వారంలో సీఐడీ దర్యాప్తు కొలిక్కిరానున్నట్టు సమాచారం.

విచారణ అధికారులు వీరే

కర్నూలు మున్సిపాల్టీ ప్లానింగ్ ఆఫీసర్ (పీవో) బి.విజయభాస్కర్, ఆదోని టీపీవో బాలమద్దయ్య బృందం కొర్లగుంట-తిరుమల బైపాస్ రోడ్డు.. రాయచోటి టీపీవో లక్ష్మీనారాయణమ్మ బృందం కొర్లగుంట.. తిరుపతి డీసీపీ మహాపాత్ర, నగరి టీపీవో మూర్తి బృందం గొల్లవానిగుంట రోడ్డు, ఒంగోలు పీవో బాబూరావు, యమ్మిగనూరు టీపీవో రాజేష్ బృందం పూలవానిగుంట, గొల్లవానిగుంట, తొండమాన్ చక్రవర్తి రోడ్డు.. బాపట్ల పీవో కాలేషా, ప్రొద్దుటూరు టీపీవో చంద్రమోహన్ బృందం డీబీఆర్ రోడ్డు.. నెల్లూరు సీపీవో హిమబిందు, గూడూరు టీపీవో నాగవల్లి బృందం అక్కారంపల్లి, కొంకా చెన్నాయగుంట రోడ్డు.. ఏలూరు పీవో సుధాకర్, వుడా టీపీఏ రేవతి బృందం కొర్లగుంట.. ఆముద పీవో సత్యమూర్తి, చిత్తూరు టీపీవో సుభద్రప్రద బృందం చింతలచేను, గంగమ్మ ఆలయ రోడ్డు.. కడప డీటీసీపీవో ఆసిఫ్, టీపీవో రత్నరాజు బృందం కొర్లగుంట ప్రాంతం, గుంతకల్ ఏసీపీ శ్రీనివాసులు, పులివెందుల టీపీవో అజయ్‌కుమార్‌లు గెస్ట్‌లైన్, గ్రాండ్‌వరల్డ్ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి పరిశీలిస్తున్నారు. మరో రెండురోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలన జరగనుంది. రోడ్డుకు గిఫ్ట్‌డీడ్ ఎంత ఇచ్చారు? ఇచ్చిన స్థలానికి టీడీఆర్ బాండ్లు ఎక్కువ ఇచ్చారా? బాండ్లు ఇచ్చిన చోట రోడ్డు వేశారా? వేయకపోతే ఎందుకు వేయలేదు? వంటి వివరాలను సేకరిస్తున్నారు.



దర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

హుండీ(ఆదివారం నాటిది) ద్వారా: రూ.3.77 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,124

తలనీలాలు సమర్పించిన వారు: 24,069

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తి స్పెషల్

ఏడు గంగమ్మల జాతర

గ్రామ దేవతలకు ఏటి ఉత్సవాన్ని జాతర మహోత్సవంగా నిర్వహించడం మన సంప్రదాయంలో ఒక భాగం. తమను గంగమ్మతల్లి చల్లంగా చూడాలన్న సంకల్పంతో జాతరను వైభవంగా నిర్వహిస్తారు. అమ్మకు అంబళ్లు పోయడమే కాకుండా వేషధారణలతో పాటు ఊరేగింపులు, పొంగళ్లతో పాటు జంతుబలులు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. జిల్లా అంతటా వేసవిలోనే గంగ జాతరలు జరుగుతున్నాయి. అందునా ఒకే గంగమ్మను కొలువుదీర్చి మొక్కులు చెల్లించుకుంటారు. కానీ, జాతర విషయంలో శ్రీకాళహస్తికి ప్రత్యేకత ఉంది. ఇక్కడా ఒకేరోజు.. ఏడు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహిస్తారు. డిసెంబరు నెలలో.. చలికాలంలో జాతర నిర్వహించడం ఇక్కడి స్పెషాలిటీ. ఏడుగంగమ్మలైన అక్కా చెల్లెళ్లు శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలిశారని పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. వందలాది సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో ఏడు గంగల పండుగ నిర్వహిస్తున్నారు. చరిత్రాత్మకంగా పరిశీలిస్తే.. జమిందారులు, సంస్థానాదీశుల సమయంలో శ్రీకాళహస్తి గ్రామానికి ఏడువైపులా గంగరాళ్లు (తెట్టురాళ్లు) ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. ఆయా గంగమ్మల వద్ద ఆయా ప్రాంతాల్లో ఏటా అమ్మవార్లను కొలువుదీర్చడం.. ఒకేరోజు, ఒకేసారి ఊరేగింపు, నిమజ్జనం జరగడం తరతరాలుగా వస్తోంది. మరెక్కడా లేని విధంగా ఒకేసారి ఏడు గంగమ్మలకు జరిగే జాతర రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. శ్రీకాళహస్తిలో బుధవారం గంగజాతర వైభవోపేతంగా జరగనుంది. మంగళవారం రాత్రి అమ్మవార్లకు ఏడు గంగమ్మల ఆలయం వద్ద పూజలు నిర్వహించాక ముసుగు తొలగిస్తారు. బుధవారం వేకువజామున భక్తులకు దర్శనభాగ్యం కల్పించాక.. పెండ్లిమండపం వరకు ఏడుగంగమ్మలు ఒకరి వెనుక ఒకరుగా ఊరేగింపుగా వస్తారు. అక్కడ్నుంచి ఆయా ప్రాంతాలకు అమ్మవార్లను తీసుకొస్తారు. ఉదయం 9గంటల నుంచి భక్తులు ఏడు గంగమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీ రాత్రికి ఏడుగురు అమ్మవార్లను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకచ్చి.. ఒక్కొక్కరికి వరుసగా ప్రత్యేక పూజలతో నిమజ్జన కార్యక్రమం చేయడంతో జాతర ముగుస్తుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



పెండ్లిమండపం వద్ద విద్యుద్దీపాలంకరణ

అమ్మవార్లు కొలువుదీరేది ఇక్కడే

మొదటి గంగమ్మ పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మగా కొలువుదీరతారు వరసగా.. బాబుఅగ్రహారం వద్ద అంకాళమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరిగా, సన్నిధివీధిలో అంకమ్మగా, తేరువీధిలో నల్లగంగమ్మగా, జయరామారావువీధిలో కావమ్మగా, బేరివారి మండపం వద్ద ముత్యాలమ్మగా గంగమ్మలను ఆరాధిస్తారు.



గాంధీవీధిలో గంగమ్మ తెట్టురాయి

వెటర్నరీలో తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల సదస్సు

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా తిరుపతిలోని వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధన అంశాలకు సంబంధించి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. బుధ, గురువారాలు రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సులో 'పశువుల ఆరోగ్యం-ఉత్పత్తి కోసం పరిష్కారాలు' ఆవిష్కరణపై వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది పరిశోధకులు హాజరై తమ పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వెటర్నరీసైన్స్. అప్లికేషన్లలో సాంకేతిక పురోగతి, క్లినికల్ ప్రొసీజర్స్-డిసీజ్ డయాగ్నోసిస్‌లో సాంకేతిక పురోగతి, డ్రగ్‌డిజైన్, కీమోథెరపీలో ప్రస్తుత పోకడలు, స్థిరమైన పశువుల ఉత్పత్తి, నిర్వహణ, బయోటెక్నాలజీ, స్టెమ్‌సెల్ పరిశోధనలో ప్రగతి, మల్టీ డిసిప్లినరీ రీసర్చ్.. అప్లికేషన్స్‌పై చర్చ, పరిశోధనల అంశాలపై లీడ్ పేపర్ ప్రజంటేషన్లు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథిగా చెన్నైకి చెందిన ఫుడ్స్ అండ్ ఫీడ్‌మిల్స్ ఎండీ ప్రకాష్‌రావు, పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్, వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీ రమణ తదితరులు హాజరవుతారని తెలిపారు.

శ్రీవారి సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి



తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

13నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పర్వదినం సందర్భంగా తమిళనాడు తిరువణ్ణామలైకి ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా తరపున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఇంచార్జ్ డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమిళ కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందురోజున శుక్రవారం రాత్రి తిరువణ్ణామల కొండపై పవిత్ర దీపం వెలిగించనున్నారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ప్రత్యేక సర్వీసుల రవాణా ప్రారంభం కానుంది. శనివారం, ఆదివారం ఉదయం వరకు ఈ ప్రత్యేక బస్సులు సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబరు 27, 28 నుంచి బయల్దేరేలా చర్యలు తీసుకున్నారు. మొత్తం 115 బస్సులతో 232 ట్రిప్పులు తిప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

13న ఎడ్‌సెట్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన ఎడ్‌సెట్-2024 స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎస్వీయూలోని అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్టు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు, ఎడ్‌సెట్ ర్యాంకు కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావచ్చని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ బాబు కోరారు.

జర్మనీలో పద్మావతి వర్సిటీ వీసీ ఉమ

ఘన స్వాగతం పలికిన జర్మన్ వర్సిటీల ప్రతినిధులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ జర్మనీ చేరుకున్నారు. వారం రోజుల పర్యటనలో భాగంగా జర్మనీకి చేరుకున్న ఆమెకు అక్కడి యూనివర్సిటీలకు చెందిన అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా వర్సిటీల ప్రతినిధులతో ఆమె సమావేశమై పద్మావతి వర్సిటీ ప్రగతిని వివరించారు. అక్కడి యూనివర్సిటీల నిర్వహణ, అభివృద్ధిని గురించి అడిగి తెలుసుకున్నారు. బోధన, పరిశోధన, విస్తరణ, విద్యార్థులు, ఉద్యోగుల మార్పిడి అంశంలో పరస్పర సహకారంపై చర్చించారు. పరస్పర సహకారానికి జర్మనీ యూనివర్సిటీలు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 14వ తేదీకి జర్మనీ పర్యటన ముగించుకుని వీసీ ఉమ తిరుపతికి చేరుకోనున్నారు.

'ఉపాధి'లో అవకతవకలపై

ఫీల్డ్‌అసిస్టెంట్ సస్పెన్షన్

- పనులు ఒకరికి.. బిల్లు వేరొకరి ఖాతాలోకి..
- సామాజిక తనిఖీలో వెలుగుచూసిన వైనం
- రూ.27,983 రికవరీకి ఆదేశం

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని సి.గొల్లపల్లెలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్ రమాదేవిని సస్పెండ్ చేశారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,72,11,175 లతో చేపట్టిన 1,358 పనులకు సంబంధించి గతనెల 6 నుంచి 18వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ రవి ఆధ్వర్యంలో 12 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభలో నివేదించారు. సి.గొల్లపల్లెలో గ్రామ ఉపసర్పంచ్ చెంగారెడ్డి ఫిర్యాదు మేరకు సామాజిక తనిఖీలో కూలీల నగదు చెల్లింపుల్లో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఫీల్డ్‌అసిస్టెంట్‌ని సస్పెండ్ చేశారు. పనిచేసిన కూలీకి కాకుండా వేరొక వ్యక్తి ఖాతాకి రూ.27,983 నగదు చెల్లించిన విషయం నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రూ. 27,983 రికవరీకి ఆదేశించారు. సి.మల్లవరం పంచాయతీలో చేపట్టిన సిమెంటు రోడ్డుపనుల్లో గుత్తేదారుడికి చెల్లించాల్సిన రూ.87,728 నగదు పీఆర్‌ఏఈ ఖాతాలో జమయ్యింది. దీన్ని పీఆర్ ఏఈ నుంచి తిరిగి గుత్తేదారుకి చెక్కురూపంలో అందజేశారు. అలాగే బ్రాహ్మణపట్టు, ఇతర పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో కొలతల తేడాకి సంబంధించి తనిఖీలో రూ.2,28,517కి ఎస్‌ఆర్‌పీ వివరణ కోరారు. దీనిపై ఏపీవో మమతారాణి మాట్లాడుతూ వర్షాలతో పనులు పూర్తిచేయలేకపోయామని వివరించారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీవీ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ చిన్న పొరపాట్లు జరగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.శివయ్య, ఎంపీపీ వేముల యశోద, జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, చంద్రగిరి క్లస్టర్ ఏపీడీ రెడ్డెప్ప, ఏపీవో టి.మమతారాణి, కె.రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటేరులో ఆక్రమణదారుల బరితెగింపు

- చీకటి పడ్డాక నిర్మాణ పనులు
- అడ్డుకున్న వీఆర్వోలపై దాడికి యత్నం





చీకటిలో చేపట్టిన నిర్మాణ పనులు - స్వర్ణముఖినదీపోరంబోకులో నిర్మాణం

తిరుపతిరూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం.. నగరానికి అతిసమీపంలోని ఓటేరులో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. అవిలాల లెక్కదాఖలా ఓటేరు పంచాయతీలోని సర్వేనంబరు362కి చెందిన స్వర్ణముఖినదిపోరంబోకులో చీకటిపడ్డాక నిర్మాణపనులు చేపడుతున్నారు. ఎవరైనా అడ్డుకుంటే తిరగబడేందుకు ఆకతాయిలను వెంటబెట్టుకుంటున్నారు. నిర్మాణ పనులకు మహిళా కూలీలని వినియోగించుకుంటున్నారు. వీరైతే అధికారులు ముందుకురావడానికి ధైర్యంచేయరన్న ఆలోచనతో ఈ పనిచేస్తున్నట్లు తెలిసింది. సిమెంటరాయి, ఇసుకని తరలించారక్కడికి. రాత్రివేల పనులు చేపట్టారు. ఈ విషయం సోమవారం సాయంత్రం 7గంటలకు రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కి సమాచారం అందింది ఆయన ఆదేశాలతో వీఆర్వోలు అక్కడికి వెళ్లేసరికి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో పనులు చేపట్టడంపై వీరు నిలదీశారు.పునాది వరకు ఏర్పాటు చేసిన సిమెంట్‌రాయిని కొంతవరకు తొలగించారు. కూలీల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆక్రమణదారుడు 30మందికిపైగా ఆకతాయిలని తీసుకొచ్చి వీఆర్వోలపై దౌర్జన్యానికి దిగాడు. ఎలా తొలగిస్తారంటూ దాడికి యత్నించినట్లు తెలిసింది. మత్తులో ఉన్న ఆకతాయిలో కొందరు చిన్నపాటి ఆయుధాలు కూడా తీసుకొచ్చారని సమాచారం. దీంతో వీఆర్వోలు భయాందోళనకు గురయ్యారు.ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఆక్రమణల తొలగింపు సమయంలో పోలీసులని వెంటపంపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్‌తోనూ చర్చించారని తెలిసింది. కాగా, ఇదే స్థలానికి కొంత ముందుగా సర్వేనంబరు 360లో స్వర్ణముఖినదిపోరంబోకు స్థలంలో ఇటీవల ఆక్రమణదారులు రెండు రేకులషెడ్డులతో నిర్మాణం చేపట్టారు. ఆకతాయిలను పక్కన పెట్టుకుని ఈ పనులు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.



మంగళవారం సాయంత్రం పొగమంచు కమ్మిన వేళ.. తిరుపతిలోని మంగళం రోడ్డు నుంచి లీలామహల్ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో కనిపించిన దృశ్యం.

తహసీల్దారుపై సస్పెన్షన్ వేటు

కడప కలెక్టరేట్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో చేరకుండా, ఉద్యోగ నిబంధనలు ఉల్లంఘించి ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతారు చేసిన తహసీల్దారు యు.దస్తగిరయ్యను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాధారణ బదిలీల్లో భాగంగా యు.దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని కేఆర్‌ఆర్‌సీ తహశీల్దారుగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయన వచ్చి చేరలేదు. వెంటనే విధుల్లో చేరాలని ఫోన్ ద్వారా చెప్పడమే కాకుండా కలెక్టర్ మెమో కూడా జారీ చేశారు. అయినా విధుల్లో చేరలేదు. దీంతో తహసీల్దారు దస్తగిరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

శిశుసంరక్షణ కేంద్రం నుంచి పరారైన బాలికలను పట్టుకున్న పోలీసులు

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలను తడ పోలీసులు పట్టుకున్నారు. వివిధ కేసుల్లో బాధితులుగా ఉన్న ఈ ముగ్గురు నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రంలో రక్షణ పొందుతున్నారు. మంగళవారం ఉదయం సంరక్షణ కేంద్రం నిర్వాహకుల కళ్లుకప్పి ఈ ముగ్గురు పరారయ్యారు.వీరు నెల్లూరు నుంచి మెమో రైలులో రాత్రి సమయంలో తడకు వచ్చారు. అక్కడ నుంచి బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ఆ సమయంలో సాధారణ తనిఖీలు చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వారి ప్రవర్తనపై అనుమానించిన పోలీసులు వారి వివరాలను అడగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ విచారించగా నెల్లూరు నుంచి పారిపోయినట్లుగా గుర్తించారు. వెంటనే ఎస్‌ఐ కొండప్పనాయుడు నెల్లూరు సంరక్షణ కేంద్రానికి సమాచారం అందించారు. సదరు బాలికలను నెల్లూరు సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు.

టీటీడీ ఉద్యోగులందరికీ నేమ్‌బ్యాడ్జీ

- ఫేస్‌బుక్ ఖాతాలో టీటీడీ చైర్మన్ వెల్లడి

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పనిచేసే ఉద్యోగులందరికీ త్వరలో నేమ్‌బ్యాడ్జీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నానని ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి వెల్లడించారు. కొందరు ఉద్యోగులు భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలకు వెనకాడబోనని ఆ పోస్టులో స్పష్టంచేశారు. నేమ్‌బ్యాడ్జీ ఏర్పాటుతో భక్తులతో అమర్యాదగా వ్యవహరించిన వారిని సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో బాధ్యతాయుతంగా.. అంకితభావంతో ఉద్యోగులు ప్రవర్తించేందుకు ఈ బ్యాడ్జీ విధానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో అర్ధ వార్షిక పరీక్షలు సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్ మోడల్ పేపర్ (ఎస్‌ఏటీఎంపీ) టర్మ్-1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు తెలిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఎంబీయూలో ఫీజుల దోపిడీ: ఏఐఎస్‌ఎఫ్

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా ఎంబీయూలో ఇంజనీరింగ్ సీట్లు పొందిన విద్యార్థుల నుంచి ఏటా అధికంగా రూ.20వేల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై గతంలో ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఫీజుల విషయంపై ప్రశ్నిస్తే ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై మంచు మనోజ్ ఇచ్చిన వివరణపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రెగ్యులేషన్ కమిటీతో విచారణ చేయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే తల్లిదండ్రులను కలుపుకొని తాము ఎంబీయూ విశ్వవిద్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవారం రంగంపేటలోని కళాశాల వద్దకు వెళ్లిన జర్నలిస్టులపై బౌన్సర్లు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

28న టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈనెల 28వ తేదీన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఈ బోర్డుకు ఇది రెండో సమావేశం కావడంతో కొన్ని కీలకఅంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.

సీఎంను కలిసిన టీటీడీ అదనపు ఈవో



తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం సీఎం చంద్రబాబును విజయవాడలో కలిశారు. నాలుగు నెలల్లో తిరుమలలో చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించిన సౌకర్యాలు, చేసిన మార్పులు, చేర్పులను వివరించారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు దర్శన నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను తెలిపారు. అన్నప్రసాదాలు, లడ్డూల నాణ్యత పెంపుపై మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, తిరుపతి పవిత్రతను కాపాడేలా వ్యవహరించాలని సీఎం సూచించారు.

హైరోడ్డు విస్తరణ పనుల్లో కదలిక

అధికారులతో కలిసి రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే జగన్ ● పార్టీలకతీతంగా సహకరించాలని వినతి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని హైరోడ్డు విస్తరణ పనుల్లో కదలిక వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైరోడ్డు విస్తరణ పనులపై స్థానిక ఎమ్మెల్యే జగన్మోహన్ దృష్టి సారించారు. పది రోజులుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు.. కోర్టు, స్టేట్ బ్యాంకు, రైల్వే స్థలంతోపాటు ప్రైవేటు ఆస్తులకు మార్కింగ్ చేశారు. అంతకు ముందు విజయ డెయిరీ వద్ద తాత్కాలికంగా వేసుకున్న షెడ్లను, దుకాణాలను తొలగించారు. ఈ నేపథ్యంలో మంగళవారం అధికారులు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే హైరోడ్డును పరిశీలించారు. కట్టమంచి రైల్వే బ్రిడ్జి నుంచి గాంధీ విగ్రహం వరకు, అక్కడి నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు, చౌడేశ్వరి ఆలయం నుంచి దుర్గమ్మ గుడి వరకు ఉన్న మాస్టర్ ప్లాన్‌పై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ఎక్కడెక్కడ ఎంత అవసరం ఉంది, మార్కింగ్ ఎన్ని అడుగుల వరకు వేస్తున్నారు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై మాట్లాడారు. ముందుగా ప్రభుత్వ స్థలాలను తీసుకోవాలని సూచించారు. కోర్టులో ఉన్న స్థలాలపై, దుర్గమ్మ ఆలయానికి ఇబ్బంది లేకుండా ఏ విధంగా విస్తరణ చేయాలనే అంశంపై సమాలోచనలు చేశారు. రోడ్డు విస్తరణ పనులను సత్వరం ప్రారంభించాలని అధికారులకు సూచించారు. నగరం అభివృద్ధి చెందాలంటే పార్టీలకు అతీతంగా అందరూ కలిసి వచ్చి విస్తరణ పనుల్లో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


విస్తరణ రోడ్డు మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు

రూ.5కోట్లతో పానాటూరు రోడ్డు పనులు

గుడిపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-వేలూరు మార్గంలోని ఎంసీఆర్ క్రాస్ నుంచి గొల్లమడుగు వరకు ఉండే పానాటూరు రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి ఎమ్మెల్యే జగన్మోహన్ తీసుకెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం వారిద్దరూ అధికారులతో కలిసి ఎంసీఆర్ క్రాస్ నుంచి తమిళనాడు బోర్డర్ శ్రీలక్ష్మీ నరసింహ కళాశాల వరకు రోడ్డును పరిశీలించారు. సుమారు ఐదు కిలోమీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా వెడల్పు చేసి ప్రజలకు సౌకర్యంగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారుల నివేదిక ప్రకారం సుమారు రూ.5కోట్లు అవుతుందని చెప్పగా, పనులను మొదలు పెట్టాలని కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రధానంగా తాగునీటి సమస్యపై ఆరాతీశారు. మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా.. కాలనీల్లో సీసీ రోడ్లు వేశారా.. ఇంకేమైనా అవసరం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, పీఆర్, ఆర్అండ్‌బీ ఈఈలు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, ఆర్.గాంధీ, టీడీపీ నేతలు పీటర్, బాలాజి నాయుడు, హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, దొరబాబు, సాంబశివనాయుడు, బాలసుబ్రహ్మణ్యం నాయుడు, నాగరాజయాదవ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజ్ పాల్గొన్నారు.


పానాటూరు రోడ్డు సమస్యను కలెక్టర్‌కు తెలియజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

స్కూల్ వ్యాన్లకైనా అనుమతి ఇప్పించండి

బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిలో రోడ్డు పనుల దృష్ట్యా బొమ్మసముద్రం రైల్వేగేటు మీదుగా స్కూల్ వ్యాన్లను ఉదయం, సాయంత్రం వేళల్లో అనుమతి ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడులు కలెక్టర్‌ను కోరారు. నేషనల్ హైవే అధికారులతో ఫోన్లో మాట్లాడిన కలెక్టర్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో గతంలో ఉండిన ఎస్బీఐ ఏటీఎంను పునఃప్రారంభించాలని నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, హేమాద్రి నాయుడు కోరారు. బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

జాబ్‌మేళాలో 22 మందికి ఉద్యోగాలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, డీఆర్‌డీఏ, సీడప్, జిల్లా ఉపాధి కల్పశాఖలు సంయుక్తంగా మంగళవారం జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించాయి. ఐసీఐసీఐ బ్యాంకు, నిట్ లిమిటెడ్, కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రైవేటు లిమిటెడ్, టాటా క్యాపిటల్ లిమిటెడ్, ఏయూ ఫైనాన్స్ బ్యాంకులు పాల్గొన్నాయి. 57 మంది అభ్యర్థులు రాగా, 22 మంది నాలుగు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి మురళీ కృష్ణ, ఎంప్లాయిమెంట్ అధికారి పద్మజ, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సింగ్ పట్టభద్రులు సౌదీలో పనిచేసే అవకాశం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలోని ప్రముఖ రిహాబిలిటేషన్ సెంటర్లలో పనిచేయడానికి ఆసక్తి కలిగిన నర్సింగ్ పట్టభద్రులు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ), స్కిల్ ఇంటర్నేషన్ ఇన్నోవేటివ్‌లో భాగంగా అల్ యూసుఫ్ ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్ ఫర్ నర్సెస్ ద్వారా ప్లేస్‌మెంట్ ప్రోగ్రాములను నిర్వహిస్తుందన్నారు. ఎంఎస్సీ, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, 1-5 ఏళ్లలోపు అనుభవం కలిగినవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు skillinternational@apssdc.inలో బయోడేటాను పొందుపరచాలన్నారు. దరఖాస్తులోనే పూర్తి వివరాలను ఉంటాయన్నారు.

చాగంటి నియామకంపై విమర్శలు తగదు: ఆపస్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుడిగా చాగంటి కోటేశ్వరరావు నియామకంపై విమర్శలు చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈయన నియామకంపై బహిరంగ లేఖ రాయడం సరికాదన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచడం, సంస్కృతి సంప్రదాయాలు గుర్తు చేయడానికి చాగంటి లాంటి వారి సలహాలు, సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీలలో కేఈఎసీ విద్యార్థికి స్వర్ణం


దినేశ్‌ను అభినందిస్తున్న బీసీ.నాగరాజ్ తదితరులు


కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోవాలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.దినేశ్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ తమ విద్యార్థి దినేశ్ స్వర్ణ పతకం సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. అతనికి అన్నివిధాలా సహకారం అందిస్తామన్నారు. కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ క్రీడలు కేవలం పేరు కోసమే కాకుండా, మానసిక శారీరకత దృఢత్వానికి ఉపయోగపడుతాయన్నారు. అనంతరం జ్ఞాపిక బహూకరించి, శాలువ కప్పి దినేశ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీఎన్ విద్యా సంస్థల సీఈవో ఎస్.సాగర్ రాజ్,ప్రిన్సిపల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఫిజికల్ డైరెక్టర్ సి.సతీశ్‌కుమార్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● 11 మంది బాధిత రైతులకు చెక్కుల పంపిణీ

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో పంటలను నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం పాతపేట, బోడిరెడ్డిగారిపల్లి, వెంకటదాసరపల్లి పంచాయతీల్లో ఏనుగుల దాడిలో పంటలను నష్టపోయిన 11 మంది రైతులకు మంగళవారం చల్లా రామచంద్రారెడ్డి నివాసంలో చెక్కులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్‌బీఓ శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ డీపట్టాల సృష్టికర్త అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో రైతులకు నకిలీ డీ పట్టాలను ఇచ్చి వారిని మోసగించిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆ వివరాలు వెల్లడించారు. గుడుపల్లె మండలంలో రైతులకు నకిలీ డీపట్టాలను ఇచ్చి మోసగిస్తున్నారని తహసీల్దార్ సీతారామన్ గుర్తించారు. దీనిపై ఈ నెల7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నకిలీ పట్టాలను ఇచ్చి మోసగిస్తున్న వ్యక్తి గుడుపల్లె మండలం కుప్పిగానిపల్లె పంచాయతీ కోటచెంబగిరి గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు జగదీష్(30)గా గుర్తించారు. అతనిపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో మంగళవారం కుప్పం పీఈఎస్ కళాశాల ఎదురుగా ఉన్న ఓ జిరాక్స్ దుకాణంలో నకిలీ డీ పట్టాలను జిరాక్స్ చేస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రెండు నకిలీ డీ పట్టాలు, 8 జిరాక్స్ కాపీలను సీజ్ చేశారు. అతడిని రిమాండుకు తరలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేతమ్స్ షుగర్స్ పరిధిలోని మండలాలు ఎస్ఎన్‌జేకి మళ్లింపు

నగరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలంలో ఉన్న నేతమ్స్ షుగర్స్ పరిధిలోని మండలాలను ఎస్ఎన్‌జే చక్కెర కర్మాగార జోన్ పరిధిలోకి మళ్లిస్తూ రాష్ట్ర కేన్ కమిషనర్ తాత్కాలిక ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా అసిస్టెంట్ కేన్ కమిషనర్ జాన్ విక్టర్ తెలిపారు. మంగళవారం నగరిలో జరిగిన నగరి డివిజన్ చెరకు రైతుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేతమ్స్ చక్కెర కర్మాగారం 2020 నుంచి మూసివేయడంతో దీని పరిధిలోని నగరి, నింద్ర, విజయపురం, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం రైతుల కోరిక మేరకు వీరిని ఎస్ఆర్‌పురం మండలంలోని నెలవాయి వద్ద ఉన్న ఎస్ఎన్‌జే కర్మాగారం పరిధిలోకి చేర్చడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలోని రైతులందరూ ఈవిషయాన్ని గమనించి ఏజెంట్లను ఆశ్రయించకుండా వరుస క్రమంలో ఎస్ఎన్‌జే కర్మాగారానికి చెరకును తరలించి లబ్ధి పొందవచ్చన్నారు. ఎస్ఎన్‌జే వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. రైతులకు అన్ని సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. చెరకు విత్తనం, కలుపు మందులు, ఎరువులు, వ్యవసాయప నిముట్లు రాయితీలో ఇవ్వడం జరుగుతుందన్నారు. అడ్వయిజర్ ఎం.కృష్ణన్, ఏజీఎం వరదరాజన్, ఏవోలు చంద్రయ్య, రవిచంద్రన్ పాల్గొన్నారు.

తొలిసారి పిండమార్పిడి విజయవంతం

పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్


ఆవుతో జేడీ ప్రభాకర్, వైద్యులు

పూతలపట్టు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జెర్సీ ఆవుకు చేసిన పిండమార్పిడి (సరోగసీ) విజయవంతం అయ్యిందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివనాగరాజు తెలిపారు. మంగళవారం పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట పశువుల ఆస్పత్రిని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ సందర్శించారు. పిండిమార్పిడి చేసిన ఆవును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఆస్పత్రిలో శివనాగరాజు.. మూడు నెలల క్రితం జెర్సీ ఆవుకు పిండమార్పిడి చేయగా, అది చూలుగా నిరూపితమయ్యిందని తెలిపారు. జిల్లాలో ఇదే తొలిసారి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలుండకూడదు: ఎస్ఈ


కొంగారెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్‌కు అంతరాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం గిరింపేటలో ఉన్న తన కార్యాలయంలో ఈఈలు, డీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఎక్కడైతే హెవీలోడ్ కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందో గుర్తించాలన్నారు. ఆ ప్రాంతాల్లో స్టోర్స్‌లో అందుబాటులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు ఉపయోగించి, సమస్యను అధిగమించాలని చెప్పారు. పెండింగ్ బిల్లుల వసూలు చేయాలని, ఐదో తేదీలోపు మీటింగ్ రీడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కొంగారెడ్డిపల్లెలోని సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి.. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయనవెంట టౌన్ డీఈ ప్రసాద్ ఉన్నారు.

పర్యాటకంలో తిరుపతికి ప్రాధాన్యం

● 2024-29 టూరిజం పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం

తిరుపతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పర్యాటకంలో జిల్లాకు, తిరుపతి నగరానికి ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలానికిగాను (2024-29) మంగళవారం ఏపీ టూరిజం పాలసీని విడుదల చేసింది. ఇందులో ఏడు యాంకర్ హబ్‌ల్లో ఒకటిగా తిరుపతిని గుర్తించారు. టెంపుల్ టూరిజం సర్క్యూట్, సీ ప్లేన్ డెస్టినేషన్లలోనూ చోటు దక్కించుకుంది. కలంకారీ చిత్రకళకు, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. కాకుంటే, టెంపుల్ సర్క్యూట్‌లలో శ్రీకాళహస్తికి, బీచ్.. ఎకో టూరిజం సర్క్యూట్లలో జిల్లాకు మొండిచేయి చూపించింది. ఈ విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

నూతన టూరిజం పాలసీలో రాష్ట్రంలో ఏడు యాంకర్ హబ్‌లను ప్రభుత్వం గుర్తించింది. ఈ జాబితాలో విశాఖపట్నం, అరకులోయ, శ్రీశైలం, గండికోట, రాజమహేంద్రవరం, అమరావతితో పాటు తిరుపతికీ చోటు లభించింది. వీటిలో తిరుపతి, అరకులోయ ప్రాంతాలను స్వల్ప, మధ్యకాలిక ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. జిల్లాను ప్రధాన పర్యాటక గమ్యస్థానాలుగా గుర్తించిన ప్రభుత్వం ఇక్కడ ఒకే రంగానికి పరిమితం కాకుండా యాత్రికులకు వైవిధ్యభరిత అనుభవాన్నిచ్చేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు మైస్ టూరిజం (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్) పరంగానూ తిరుపతిని అభివృద్ధి పరచాలని నిర్ణయించింది.

తిరుపతి కేంద్రంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి

యాంకర్ హబ్ కింద తిరుపతి కేంద్రంగా చుట్టుపక్కల ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఏ మూల నుంచైనా సులువుగా జిల్లాలోని పర్యాటక గమ్య స్థానాలను చేరుకునేలా రోడ్డు, రైలు, విమాన ప్రయాణాలకు వీలు కల్పించనుంది. సామాన్య యాత్రికులను దృష్టిలో వుంచుకుని షటిల్ బస్సులు, రెంటల్ బైక్‌లు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పర్యాటక గమ్యస్థానాలు చేరే క్రమంలో మార్గాల వెంబడి పార్కింగ్ లాట్స్, పరిశుభ్రమైన రెస్ట్ రూమ్స్, తాగునీరు, స్పష్టమైన సూచిక బోర్డులు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద హైవే నిర్మాణాలు, హోటళ్లు, ఆధునిక రవాణా సదుపాయాలు వంటివి కల్పించనుంది. మరోవైపు పర్యాటక రంగం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఆసక్తి ఉన్న యువతకు ఆతిథ్య రంగంలోనూ, హస్త కళలలోనూ, టూర్ ఆపరేషన్లలో శిక్షణ ఇవ్వనుంది.

టెంపుల్ సర్క్యూట్.. సీ ప్లేన్ డెస్టినేషన్లలో స్థానం

రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన పది టెంపుల్ టూరిజం సర్క్యూట్లలో తిరుపతికి స్థానం లభించింది. తద్వారా ఈ ప్రాంతంలోని పేరు మోసిన ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. ముఖ్యంగా ఆలయాలున్న ప్రాంతాల అభివృద్ధికి డీటైల్డ్ మాస్టర్ ప్లాన్ రూపొందించనుంది. ఏడాది పొడవునా ఆయా ప్రాంతాల్లో ఉత్సవాలు, వేడుకలు నిర్వహించేందుకు వీలుగా క్యాలెండర్ రూపొందించనుంది. దీనివల్ల ఆ ప్రాంత ప్రత్యేకత రాష్ట్రవ్యాప్తంగా తెలిసే అవకాశముంది. ఆయా ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలనూ రూపొందించనుంది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా సీ ప్లేన్ డెస్టినేషన్లుగా ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది ప్రదేశాల్లో తిరుపతి కూడా ఉండటం విశేషం. అయితే విశాఖపట్నం, కాకినాడ వంటి చోట్ల నుంచీ సీ ప్లేన్ సర్వీసులను జిల్లాలో ఎక్కడికి నడపతారనే దానిపై పాలసీలో స్పష్టత ఇవ్వలేదు.

కలంకారీ సావనీర్ షాపులు



హస్త కళలకు ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా సావనీర్ షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ టూరిజం కింద వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్లు నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన హస్త కళల జాబితాలో శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ పెయింటింగ్స్‌కు చోటు దక్కింది. ఇప్పటికే ప్రాచుర్యం కలిగిన కలంకారీ చిత్రకళకు తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత ప్రచారాన్ని తెచ్చిపెట్టనుంది.

కలినరీ, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రాధాన్యం



పర్యాటక విధానంలో ఫుడ్ ఫెస్టివల్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన ఆహార పదార్థాలు, వంటలను అందరికీ పరిచయం చేయనుంది. ఆ బాధ్యతను తిరుపతిలోని కేంద్ర పర్యాటక శాఖకు చెందిన ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌పై పెట్టాలని భావిస్తోంది. వీటి ద్వారా ఏడాది పొడవునా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించడం, వేర్వేరు స్థాయిల హోటళ్ల నడుమ పోటీలు నిర్వహించడం, విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఆసక్తి కలిగిన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనుంది.

టెంపుల్ సర్క్యూట్లలో శ్రీకాళహస్తికి దక్కని చోటు

కాగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పది టెంపుల్ సర్క్యూట్లను ఎంపిక చేయగా అందులో పేరు ప్రఖ్యాతులున్న శ్రీకాళహస్తి లేకపోవడం గమనార్హం. పొరుగునే వున్న చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయానికి జాబితాలో స్థానం దక్కగా అంతకంటే పేరున్న శ్రీకాళహస్తిని మాత్రం పర్యాటక శాఖ విస్మరించింది. శ్రీకాళహస్తిలో ముక్కంటి ఆలయంతో పాటు చుట్టుపక్కల అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆలయాలు అనేకం వున్నాయి. అయినా జాబితాలో ముక్కంటి క్షేత్రం లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

బీచ్ టూరిజం సర్క్యూట్లలో మొండిచేయి

బీచ్ సర్క్యూట్లుగా శ్రీకాకుళం, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, నెల్లూరును మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది. 90 కిలోమీటర్ల మేర సముద్ర తీరాన్ని కలిగిన జిల్లాకు మాత్రం అవకాశం దక్కలేదు. జిల్లాలో వాకాడు, చిల్లకూరు, కోట, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ మండలాలు సముద్ర తీరాన్ని, పులికాట్ సరస్సు తీరాన్ని కలిగి ఉన్నాయి. తూపిలిపాలెం బీచ్ ఇప్పటికే రోజువారీ పెద్దసంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఆదివారాలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. తూపిలిపాలెం, శ్రీనివాస సత్రం బీచ్‌లను అభివృద్ధిపరిస్తే పర్యాటకంగా జిల్లాకు గుర్తింపుతో పాటు ఆదాయం కూడా పెరుగుతుంది. పాలసీలో దీన్ని విస్మరించారు.

ఎకో టూరిజంలోనూ అంతే

శ్రీకాకుళం-విశాఖ, తూర్పుగోదావరి-గుంటూరు, కర్నూలు-నెల్లూరు... ఈ మూడు జిల్లాలు మాత్రమే ఎకో టూరిజం సర్క్యూట్లుగా ఎంపికయ్యాయి. ఈ జాబితాలోనూ జిల్లాకు మొండి చేయి చూపించింది. వాస్తవానికి శేషాచల పర్వతాలు, వెలిగొండ పర్వతాలు, అడవులతో కూడిన జిల్లాలో ఎకో టూరిజంపరంగా తలకోన, సదాశివ కోన, కైలాసకోన, ఉబ్బల మడుగు, మామండూరు వంటి అనేక ప్రదేశాలు పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. వీటిని ఎకో టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి గణనీయ అవకాశాలున్నాయి.

ఆర్‌సీహెచ్ఎస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తక్కువగా ఉండడమేంటి?

● మెడికల్ ఆఫీసర్లపై కలెక్టర్ అసహనం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీహెచ్ఎస్ పోర్టల్‌లో తల్లీ, పిల్లల రిజిస్ట్రేషన్ తక్కువగా ఉండటమేంటని వైద్య, ఆరోగ్య శాఖ మెడికల్ ఆఫీసర్లపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా డేటాను వెంటనే అప్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చేయాలన్నారు. కాన్పులు తక్కువగా జరుగుతున్న పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లు శ్రద్ధ పెట్టాలన్నారు. కలెక్టర్‌వెంట డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, డీసీహెచ్ఎస్ ప్రభావతి తదితరులున్నారు.

ఇంకా జగన్ బొమ్మతోనే..!


ఎండీయూ వాహనంపై జగన్ బొమ్మ

శ్రీరంగరాజపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఆరు నెలలు దాటింది. అయినా ఎస్ఆర్‌పురం మండలం శెట్టివానత్తం గ్రామ పంచాయతీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనంపై మాత్రం జగన్ బొమ్మే ఉంది. సోమవారం ఉదయం రేషన్ సరుకుల పంపిణీ సందర్భంగా ఈ విషయం బయటపడింది. జగన్ బొమ్మ ఇంకా తొలగించకుండా గ్రామాలకు వెళ్లి సరుకులు పంపిణీ చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చినా కొందరు అధికారులు.. వైసీపీ ప్రభుత్వంపై స్వామిభక్తి చూపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఈ వాహనానికి ఉన్న జగన్ బొమ్మను తొలగించాలని కోరుతున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన జనం



రామకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంచాయతీ కేంద్రం వీర్నమలలోని ఎస్సీ కాలనీవాసులు తాగునీటి కోసం రోడ్డెక్కారు. కాలనీకి 15రోజులుగా తాగునీటి సరఫరా జరగడం లేదని వారు మంగళవారం ఉదయం ఆరిమానిపెంట, కుప్పం రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పారు. సాయంత్రంలోపు నీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వైసీపీ ప్రభుత్వ పాపాలు రైతులకు శాపాలు



సదస్సులో సమస్యలు వింటున్న అధికారులు, నేతలు

రామకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పేరిట వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు, రైతులకు శాపాలుగా మారాయని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. మంగళవారం రామకుప్పం మండలం రాజుపేట, బైపరెడ్లపల్లెల్లో నిర్వహించిన రెవిన్యూ సదస్సుల్లో వారు మాట్లాడారు. రైతులు తాము ఎదుర్కొంటున్న భూసమస్యలపై వినతులిస్తే, సాధ్యమైనంత త్వరగా ఆ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ సదస్సుల్లో తహసీల్దారు బాబు, టీడీపీ నాయకులు వెంకటరమణ, బాలరాజు, నారాయణస్వామి, నరేంద్రరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కార్యదర్శులకు పనిముట్లు అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతిలు తెలిపారు. మంగళవారం మండల సచివాలయంలో వారు గ్రామపంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్య పనిముట్లు, హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, ఆంజి, శ్రీరాములు పాల్గొన్నారు.

బల్ల మాజీ సర్పంచు మృతి



యూసఫ్‌ఖాన్ (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్ల పంచాయతీ మాజీ సర్పంచు యూసఫ్‌ఖాన్ మంగళవారం మృతిచెందారు. వయోభారంతో ఆయన కుప్పంలోని తమ నివాసంలో మృతిచెందారు. యూసఫ్‌ఖాన్ 1989 నుంచి 1995 వరకు సర్పంచుగా కొనసాగారు. ఆయన మృతి పట్ల ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, నాయకులు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, నాగభూషణం, మహ్మద్ రఫీ, సలాంసాబ్, ఆదిల్, నియాజ్, స్థానిక నేతలు ఎర్రప్ప, మునిరత్నం, అల్తాఫ్, శంకర్, జబీర్, బర్కత్, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, హనుమంతు తదితరులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

'మమ్మల్నెందుకు పిలువలేదు..!'



నిరసన తెలుపుతున్న దళిత, గిరిజన నాయకులు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి తమను పిలువకపోవడంపై దళిత, గిరిజన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కనీసం కోరం లేకుండా నిర్వహించడానికి నిరసనగా కుప్పంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ సమావేశంపై ఆర్డీవో మీద జాతీయ మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, కడా పీడీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో దళిత నాయకుడు దేవరాజ్, బంజారా సేవా సంఘం నాయకుడు రవినాయక్, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుభాన్‌కు జీవిత సాఫల్య పురస్కారం



పలమనేరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానవహక్కుల మండలి 76వ వారికోత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో భారీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ప్రపంచ మానవహక్కుల మండలి దక్షిణ భారత దేశపు మీడియా ప్రతినిధి పలమనేరుకు చెందిన అబ్దుల్ సుభాన్‌కు జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్, దక్షిణ భారతదేశం మహిళా అధ్యక్షురాలు చింత శారద, వివిధ పదాధికారులు హాజరయ్యారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు మదర్‌థెరిసా విద్యార్థి



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన మహమ్మద్ భాష

గంగవరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మదర్‌థెరీసా కళాశాలకు చెందిన మహమ్మద్‌బాష అనే విద్యార్థి సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. నవంబరు 21 నుంచి కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగిన యూనివర్శిటీ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి మహమ్మద్ బాష ఎస్వీ యూనివర్శిటీ తరఫున పాల్గొన్నాడు. అక్కడ మెరుగైన ప్రదర్శన కనబరచడంతో సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక య్యాడు. కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి, రాజ్‌కుమార్, ప్రభాకర్‌నాయుడు అతడిని అభినందించారు.

దాడిచేసి గాయపరిచారని ఫిర్యాదు

పుంగనూరు రూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): దాడి చేసి గాయపరిచినవారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. పట్టణ సమీపంలోని నక్కబండ కాలనీలో కాపురం ఉన్న రాజునాయక్‌కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య రెడ్డెమ్మ పిల్లలు వినోద్, భారతికి, చిన్న భార్య బుజ్జమ్మలకు మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో బుజ్జమ్మ సమీప బంధువులైన శ్రీను, సూరిలతో కలిసి వినోద్, భారతిలపై దాడి చేయించింది.



మేకల మార్నింగ్ వాక్..!

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అవును.. మేకలే. మార్నింగ్ వాక్ చేస్తున్నది. కుప్పంలో ప్రతినిత్యం ఉదయం పూట కనుల పండువగా కనిపించే దృశ్యమిది. అయితే మేకలు, గొర్రెలు ఇలా మేతకు వెళ్లే క్రమంలో ఇళ్లముందు ప్రేమతో పెంచుకున్న కాసిన్ని మొక్కలను మింగేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం తమ ఇళ్ల ముందు మొక్కలను కాపాడుకోవడానికి ఇళ్ల యజమానులు కర్రలతో కాపాలా ఉండాల్సిన పరిస్థితి. అలాగే మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కుప్పంలోని కూడళ్లు, డివైడర్లలో ఏర్పాటు చేయించిన అందమైన ఆకుపచ్చని మొక్కలను సైతం ఆరగించేస్తున్నాయి. మొక్కలు మోడుగా మారిపోతున్నాయి. మేకల యజమానులు వీటిని ఇలా రోడ్డుపై వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. మున్సిపల్ అధికారులు జరిమానా విధిస్తే గానీ పచ్చదనాన్ని కాపాడుకోలేమని ప్రజలు పేర్కొంటున్నారు.

కుప్పం మున్సిపాలిటీలో నేడు, రేపు ఆధార్ శిబిరాలు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో గురు, శుక్ర వారాల్లో రెండు రోజులపాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరమసముద్రంలోని కస్తూరిబా గాంధీ ప్రభుత్వ బాలికా విద్యాలయాలలో ఈ శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరాలలో ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభం

బైరెడ్డిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న సెయింట్‌జోసెఫ్ కాన్వెంట్‌లో స్కిల్‌డెవలప్‌మెంట్‌పై యువతకు మంగళవారం నుంచి శిక్షణాతరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులను మాజీఎంపీపీ కృష్ణవేణి ప్రారంభించారు. మీడియా డెవలపర్, బ్యూటీషియన్ కోర్స్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై 10నెలల పాటు జరిగే శిక్షణాతరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ చిన్నప్ప, నిర్వాహకులు శాలిని, విష్ణు, సెరిల్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

పలమనేరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్ పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు మండలం కూర్మాయి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏడుగురు రైతులు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మండల టీడీపీ కన్వీనర్ నాగరాజరెడ్డి, టీడీపీ నాయకులు పెద్దబ్బ, సర్వేయర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఆర్ రెడ్డికి ఘన నివాళి

గంగవరం, డిసెంబరు10,(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత అయిన సీఆర్ రెడ్డి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. సీఆర్ రెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశీలిగా కీర్తి గడించిన రామలింగారెడ్డి చిత్తూరు వాసి కావడం జిల్లా వాసులందరికీ గర్వకారణమన్నారు. సీఆర్ రెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయ తొలి ఉపకులపతిగా విద్యారంగానికి ఎనలేని కృషిచేశారన్నారు. కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, సాహిత్య విమర్శకునిగా ఆర్థికవేత్తగా విశేష సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామోదరం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా: పెద్దిరెడ్డి

సోమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ కుసుమ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచులు వెంకట్రమణ, నాగేశ్వరరావు, మోహన్, పీఎల్ఆర్ రాజారెడ్డి, నాగభూషణం రెడ్డి, మనోహర్, నరసింహులు పాల్గొన్నారు.





మట్టి తోడేయడంతో గుంతలమయమైన కోమటివాని చెరువు, ఆమినిగుంట చెరువు

రూపు కోల్పోతున్న చెరువులు

- విచ్చలవిడిగా మట్టి అక్రమ రవాణా
- చెరువుల్లో భారీ గోతులు
- పట్టించుకోని అధికారులు

చౌడేపల్లె, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ రవాణాతో మండలంలోని పలు చెరువులు రూపు కోల్పోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్స్‌కవేటర్లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి తరలిస్తుండడంతో చెరువుల్లో బావులు ఏర్పడ్డాయి. చౌడేపల్లెకు సమీపంలో ఉన్న అమినిగుంట చెరువులో సుమారు 40 నుంచి 50 అడుగు మేర యంత్రాలతో గుంతలు పెట్టి మరి మట్టి తోలుతున్నారు. అలాగే గ్రామ సమీపంలో ఉన్న కోమటివాని చెరువులో సైతం మట్టిని తరలించడంతో చెరువు గుంతల మయమైపోయింది. మండల వ్యాప్తంగా సుమారు 30 నుంచి 40 చెరువులలో మట్టి అక్రమ రవాణా సాగుతోంది. చెరువుల్లో మట్టి పొలాలకు తోలుకోవాలంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అనుమతి ఉండాలి. అది కూడా మీటరు లోతుతో ఆయకట్టు దిగువకు గుంతలు లేకుండా తవ్వుకోవాలి. అయితే మట్టి అక్రమంగా తరలించేవారు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్‌చేసే వారు భూములు చదును చేయడానికి అడ్డంగా తవ్వేస్తున్నారు. దీంతో చెరువులు ఆనవాలు కోల్పోతున్నాయి. చెరువులు నిండి పొలాలకు నీరు వచ్చే పరిస్థితి లేదు. ఇకనైనా అధికారులు స్పందించి మట్టి అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఎస్సీలకు శ్మశాన స్థలం గుర్తింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు చిట్టిబాబు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో రెవెన్యూ సదస్సులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇతర ప్రజా సమస్యలతోపాటు ఆయా గ్రామాల్లో వివిధ సామాజిక వర్గాలకున్న శ్మశాన స్థలాల సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకుంటున్నారు. మండలంలోని చిన్నబొగ్గుపల్లెలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దారు చిట్టిబాబు హాజరయ్యారు. తమకు శ్మశానం లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని అక్కడున్న ఎస్సీల ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గ్రామానికి కొంచెం దూరంలో ఉన్న పోరంబోకు స్థలాన్ని తహసీల్దారు పరిశీలించారు. ఈ స్థలాన్ని ఎస్సీలకు శ్మశాన స్థలంకోసం కేటాయించారు. తహసీల్దారుకు దళితులు ధన్యవాదాలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



పెద్దగొట్టిగల్లులో మాట్లాడుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పెద్ద గొట్టిగల్లులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల భూసమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సదస్సులో మొత్తం 17 అర్జీలు వచ్చాయని వీటిని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర కురబకుల కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినేపల్లె గ్రామంలో తహసీల్దార్ మాధవరాజు ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. ఆర్ఐ సరిత, వీఆర్వోలు పాల్గొన్నారు.

వి.కోట: వి.కోట మండలం జవ్వునిపల్లె రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 16 ఫిర్యాదులు అందినట్లు తహసిల్దార్ పార్వతి తెలిపారు. జవ్వునిపల్లె శ్మశానం ఆక్రమణకు గురైంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తక్షణం సర్వేకు ఆదేశించడంతో టీడీపీ నాయకులు ఆక్రమణదారులకు నచ్చజెప్పి ఆక్రమణలను తొలగించేందుకు అంగీకరింపజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, సర్పంచ్ భారతమ్మ, నాయకులు కోందడరెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్రారెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం పల్లివేటివారిపల్లి రెవెన్యూ గ్రామం పుచ్చలవారిపల్లిలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ జయసింహకు 20 మంది వినతిపత్రాలు అందజేశారు. డీటీ దిలీప్‌కుమార్, ఆర్ఐ దొరస్వామి, సర్వేయర్ మార్కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లె: చారాల రెవెన్యూ సదస్సులో 31 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి ఆర్ఐ భారతి, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి ఊరేగింపు

సోమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి పాదాల ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేదపండితులు మోహన్‌బాబు ఆధ్వర్యంలో హోమాలు జరిపించారు. భూనీలాదేవి సమేత శ్రీవారిని సుందరంగా పల్లకీలో అలంకరించి సోమల వీధుల్లో చెక్కభజనలు, కోలాటాల నడుమ ఊరేగించారు. ఉభయదారులైన డాక్టర్ ప్రదీప్ కుమార్ దంపతులను, వెండి పాదుకలను వితరణ చేసిన దాత ఎక్కల కృష్ణమూర్తిశెట్టిని ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్, మదనపల్లె బీటీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వై.ఎస్. మునిరత్నం ఆధ్వర్యంలో సన్మానించారు. అర్చకులు వేణుగోపాల్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాము

పుంగనూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమవు తాయని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, దేవదాయ చిత్తూరు కమిషనర్ చిట్టెమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నేతిగుట్లపల్లె సచివాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. ప్రజల నుంచి 18 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాము, ఆర్ఐ పణికుమార్, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు మాధవరెడ్డి, విరూపాక్షి, నాయకులు కోలాట వెంకటరమణ, పుల్లి వెంకటరమణ, సర్వేయర్ శ్రీనివాసులునాయక్, ప్రజలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో అల్లుడిపై దాడి

పుంగనూరు రూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో అల్లుడిపై అత్తమామలు దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు.. రామసముద్రం మండలంలోని పురాండ్లపల్లెలోని జి.వెంకటరమణ కుమార్తె అనురాధ. ఈమెకు పుంగనూరు మండలం వనమలదిన్నెకు చెందిన కే.వెంకటరమణ కుమారుడు గంగాధర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల అనురాధ పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం అత్తగారింటికి వెళ్లిన గంగాధర్‌పై మామ వెంకటరమణ, అత్త ఆదిలక్ష్మి, బావమరిది ఆదర్శ కలసి దాడిచేశారు. విషయం తెలుసుకున్న గంగాధర్ అక్క మనో వెళ్లి వారిని అడ్డుకోవడంతో ఆమెపై దాడిచేశారు. దీంతో అక్కాతమ్ముడు ఇద్దరూ పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం పెద్దపంజాణి మండలంలో జరిగింది. పెద్దపంజాణి మండలం పెద్దఆరికుంట గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కుమారుడు వెంకటేశ్ కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నొప్పి తాళలేక ఈగలమందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిక తరలించారు.

త్రోబాల్ విజేత కందూరు



సోమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు హైస్కూల్లో సోమవారం జరిగిన పుంగనూరు జోన్ త్రోబాల్ బాల, బాలికల పోటీలలో కందూరు విజేతగా నిలిచినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. బాలిక విభాగంలో చంద్రమాకులపల్లె, సోమల జట్లు రన్నర్స్‌గా నిలిచాయని వివరించారు. హెచ్ఎం వెంకట్రమణారెడ్డి, పీడీ చిన్నప్ప, ఉపాధ్యాయులు షకీల్, శివరాజ, దేవిక, హరినారాయణ, వాసు తదితరులు క్రీడాకారులను అభినందించారు.

అమ్మవారి సేవలో కమలాపురం ఎమ్మెల్యే

చౌడేపల్లె, డిసెంబరు10:(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అర్చకులు ఆయనకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

రొంపిచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల పంచాయతీలోని నీటి పారుదల చెరువులకు సంబంధించిన నీటి సంఘం ఎన్నికలు ఈ నెల 14వ తేదీన జరుగుతాయని ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్ తెలిపారు. 11వ తేదీ బుధవారం నోటిఫికేషన్ వెలువ డుతుందని పేర్కొన్నారు.

సదుం: సదుం మండలంలో ఆరు చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు డీటీ కుమార్ తెలిపారు.

సదుం తహసీల్దారుకు సన్మానం



సదుం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ(అమరావతి) చిత్తూరు జిల్లా శాఖ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సదుం తహసీల్దారు ఎస్ఎం హుస్సేన్‌ను మంగళవారం మండల ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ భాస్కర్, డిప్యూటీ తహసీల్దారు కుమార్, ఏఎస్‌వో విజయ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం



లీకవుతున్న నీరు



తాగుబోరు వద్ద నిల్వ నిలచిన నీరు

పుంగనూరు రూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లె ఎస్సీ, ఎస్టీ కాలనీలో తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయి. దీంతో నీరు లీకేజీ అవుతోంది. నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. పారిశుధ్యం లోపించింది. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధిచెందారు. పైపులైన్ లీక్ వల్ల తాగునీరు కలుషితమవుతోంది. దీనివల్ల జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పైపుల నుంచి తాగునీరు లీక్ అవుతున్నట్లు నెలరోజులుగా సర్పంచ్, సచివాలయ సిబ్బందికి చెప్పినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్లను బాగుచేయాలని ఇక్కడి జనం కోరుతున్నారు.

మానవహక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి





కుప్పంలో విద్యార్థులకు మానవ హక్కుల గురించి వివరిస్తున్న టీచర్లు, కల్లూరులో చేపట్టిన ర్యాలీ

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవహక్కుల కోసం ఐక్యంగా ఉండాలని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానవహక్కులపై విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మానవ హక్కుల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, వెంకటరమణారెడ్డి, చలపతి పాల్గొన్నారు.

కుప్పం: కుప్పం పురపాక సంఘం 1వ వార్డు సామగుట్టపల్లె మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు గాలి సురేశ్ ఆధ్వర్యంలో బుధవారం మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. మానవ హక్కులను తాము పాటించడమే కాకుండా సమాజానికి దారిచూపిన మహనీయులు మహాత్మా గాంధీ, అంబేద్కర్, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, సావిత్రిబాయి పూలే తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఉపాధ్యాయులు సౌజన్య, గాయత్రీదేవి, శాంత, సరస్వతి పాల్గొన్నారు.

అభివృద్ధిని చేతల్లో చూపించే ప్రభుత్వం

ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని చేతల్లో చూపించే ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. మంగళవారం ముత్తువాళ్లూరు, వీఎన్ కండ్రిగ గ్రామాల్లో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గత ఐదేళ్లలో కోతలే తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. అనంతరం గుడిపాల రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో రైతుల భూములను తారుమారు చేశారని, వీటిని సరిదిద్దుతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, బీజేపీ మండల అధ్యక్షుడు ధనంజయనాయుడు, జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, టీడీపీ నేతలు సాంబశివనాయుడు, శంకర్ చౌదరి, గోళ్ల హరిప్రసాద్ చౌదరి, శేఖర్, రవి నాయుడు, గుర్రప్పనాయుడు, హరిప్రసాద్, మురళీనాయుడు పాల్గొన్నారు.


ముత్తువాళ్లూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

ప్రజల వద్దకే రెవెన్యూ యంత్రాంగం

ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే కూటమి ప్రభుత్వం వచ్చి సమస్యలను పరిష్కరిస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని నెట్టేరిలో జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సులో ఆయన పాల్గొన్నారు. అర్జీలను స్వీకరించారు. అనంతరం కొత్త అరూరులో రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలను పరిష్కరించ డానికి రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రజల వద్దకే పంపుతున్న ఘనత సీఎం చంద్రబాబుదే అని చెప్పారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఉపాధి ఏపీడీ సునీల్ కుమార్, వెంకటేశులు నాయుడు, భాస్కర్ రెడ్డి, బాబుయాదవ్, రవికుమార్, చిట్టిబాబు, జగన్, కృష్ణయ్య, రఘుయాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

హక్కుల కోసం పోరాడాలి

వెదురుకుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే హక్కుల కోసం పోరాటం అలవర్చుకోవాలని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు తెలిపారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు, రంజిత్‌కుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటరమణయ్య, చిన్నయ్యశెట్టి, సుమతి, హరిత, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని 49.కొత్తపల్లిమిట్టలో హ్యూమన్ రైట్ అధ్యక్షుడు ఢిల్లీబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరులు, మండల డైరెక్టర్ శాంతి, ఆలీఅబ్బాస్, కుమార్, చంద్రశేఖర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు, టీచర్లు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● క్రైమ్ సీఐ ఉమా మహేశ్వరరావు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై మహిళలు, విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని క్రైమ్ సీఐ ఉమా మహేశ్వరరావు అన్నారు. మంగళవారం అపోలో కాలేజీలో అపోలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్టు అంటూ ఎవరైనా ఫోన్ చేస్తే 1930 సైబర్ క్రైమ్ లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళా ఎస్ఐ నాగ సౌజన్య మాట్లాడుతూ.. వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలన్నారు. ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ హసీనా, డాక్టర్ కళ్యాణి యోగిని, ఇతరులు పాల్గొన్నారు.



గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

ఇబ్బంది పడుతున్న జనం



కాళికాపురం వద్ద.. మంగళం చెరువు కట్టమీద దెబ్బతిన్న రోడ్లు

విజయపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. వైసీపీ హయాంలో ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పోవడంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత గుంతలమయంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి నుంచి విజయపురం వెళ్లడానికి దేశమ్మ గుడి నుంచి కాళికాపురం, గంగమాంబాపురం, ముత్యాలరెడ్డికండ్రిగ, మంగళం మీదుగా ఎక్కువ మంది ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు గుంతలతో నిండిపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని వాపోతున్నారు. ఇకనైనా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలపై శ్రద్ధ పెట్టండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణాలపై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో గోకులం షెడ్ల నిర్మాణ ప్రగతిపై పశుసంవర్ధక, ఉపాధి ఏపీడీలు, ఏపీవో, ఏడీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు నిర్మాణం చేపట్టని ప్రాంతాల్లో 10రోజుల్లోగా ప్రారంభించేలా అవగాహన కల్పించాలన్నారు. లేకుంటే షెడ్ల మంజూర్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని, ఎంబుక్‌లో రికార్డు చేయాలన్నారు. కలెక్టర్‌వెంట డ్వామాపీడీ రవికుమార్, పశుసంవర్ధకశాఖజేడీ ప్రభాకర్ ఉన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

వెదురుకుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో ఓ బాలికను సినిమాకు తీసుకెళ్తా అని చెప్పి మోటరు సైకిల్‌లో ఆదివారం తీసుకెళ్లి పొలంలో అత్యాచారంకు పాల్పడిన దినేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

పాలసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంఈవో2 గిరిజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఏపీఎం కల్పలత, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల టీచర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



పెనుమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001 ఏడాది పదో తరగతి చదివిన గుట్టకిందపల్లెకి చెందిన మురళీమోహన్.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి ఆర్థిక పరిస్థితి బాగా లేదని స్నేహితులకు తెలిసింది. దీంతో అందరూ కలిసి రూ.20వేలను పోగుచేసి అందజేశారు. చంద్రబాబు, వెంకటేశ్, జయపాల్, బాలచంద్ర, కుమార్, నరేష్, ముత్తుస్వామి పాల్గొన్నారు.



ఏరు దాటితేనే చదువులు..!

గంగాధరనెల్లూరు మండలంలోని పలు పంచాయతీల విద్యార్థుల పరిస్థితి ఇదీ

గంగాధరనెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏరు దాటితేనే చదువులు అన్నట్లుగా తయారైంది గంగాధర నెల్లూరు మండలంలోని పలు పంచాయతీల విద్యార్థుల పరిస్థితి. ఫెంగల్ తుఫాన్ కారణంగా ఎన్టీఆర్ జలాశయం నిండటంతో గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ నీటితో మండలంలోని ఆత్మకూరు- నరసింగరాయనిపేట (చిత్తూరు మండలం) పంచాయతీల మధ్య నీవానది ప్రవాహం ఉధ్రుతంగా సాగింది. దీని వల్ల ఏటిలో రెండు వేర్వేరు చోట్ల మట్టిరోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు మట్టి రోడ్ల మీదుగానే ఆత్మకూరు, కడపగుంట, అంబోధరపల్లె, ఎల్లాపల్లె పంచాయతీలకు చెందిన పలువురు విద్యార్థులు నరసింగరాయనిపేటలోని హైస్కూల్, ఐటీఐ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీలకు వెళ్లి చదువుకుంటున్నారు. వీరంతా పది రోజులుగా విద్యాసంస్థలకు వెళ్లలేదు. ప్రస్తుతం ఏటిలో నీటిప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో కొందరు బాలురు, మరికొందరు బాలికలు తమ కుటుంబీకులతో కలిసి ఏటిని ప్రమాదకర పరిస్థితుల్లో దాటి వెళుతున్నారు. ఇక కలిజవేడు, నందనూరు పంచాయతీలకు చెందిన విద్యార్థులదీ ఇదే పరిస్థితి. వీరు చిత్తూరులో చదువుకుంటున్నారు. కలిజవేడు-కొత్రకోన పంచాయతీల మధ్య కూడా ఏటిలోని మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో వీరికీ తిప్పలు తప్పడం లేదు.

దూరం ఎక్కువవుతుంది

నరసింగరాయనిపేటకు మట్టి రోడ్ల ద్వారా అయితే రెండు కిలోమీటర్లే ఉంటుంది. వేరే మార్గంలో అయితే 22 కిలోమీటర్లు అవుతుంది. చిత్తూరుకు మట్టిరోడ్డు ద్వారా అయితే ఎనిమిది కిలోమీటర్ల దూరమే. ఇతర మార్గాల్లో అయితే 16 లేదంటే 20 కిలోమీటర్లు ఉంటుంది. ఈ కారణం వల్లే ఏరు పొంగితే ఎక్కువ మంది విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతోంది. స్థానికులకూ ఇబ్బందులు తప్పడం లేదు.

లోలెవల్ బ్రిడ్జిలు నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం

ఈ ప్రాంతాల్లో లోలెవల్ బ్రిడ్జిలు నిర్మిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు చెబుతున్నారు. 30 ఏళ్లుగా ఈ సమస్యను ఏ ఎమ్మెల్యే కూడా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రస్తుత ఎమ్మెల్యే థామస్ అయినా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: ఎంపీపీ

వెదురుకుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కార్వేటినగరం ఎంపీపీ లత కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేపీఅగ్రహారం సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తాగునీటి వసతి ఏర్పాటుకు వచ్చిన నిధులను వెనక్కి పంపడాన్ని ఆక్షేపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరీష్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ప్రతిపాదనల మేరకే చేశామన్నారు. అర్హులైన పేదలు ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రామచంద్రయ్య సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ.. మండలంలో బాల్యవివాహాల కారణంగా 12 మంది మైనర్లు గర్భిణులుగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టడానికి సమష్టి కృషి చేయాల్సి ఉందన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ రాత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించడానికి వంద రోజుల ప్రత్యేక తరగతుల కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ముక్కవానిపల్లె సర్పంచ్ గుణవతి మాట్లాడుతూ తమ గ్రామ శ్మశానంకు రోడ్డు వసతి లేదని, మాదిగపల్లెకు శ్మశానం లేదని చెప్పగా.. పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ త్యాగరాజు తెలిపారు. సమావేశంలో ఏవో హేమలత, ఏపీఎం కవిత, ఏపీవో జాహ్నవి, ఎంఈవో మనోజ్‌కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ లత

మలేరియా లేని జిల్లాగా మారుద్దాం


అధికారులతో సమీక్షిస్తున్న అనిల్

చిత్తూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మలేరియా లేని జిల్లాగా మారుద్దామని, దీనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మలేరియా విభాగ అధికారులతో సమీక్షించారు. మలేరియా. డెంగ్యూ జ్వరాలకు కారణమైన దోమలు పుట్టకుండా.. కట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రతిగ్రామంలోనూ ఫ్రైడేని డ్రైడేగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


జంబాడ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు

విజయపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జంబాడ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం పుత్తూరు డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు తనిఖీ చేశారు. మెనూ ప్రకారమే భోజనం పెట్టాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి, ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చిత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వళ్లియప్పనగర్‌లో పదేళ్ల క్రితం ప్రైమరీ స్కూల్ పక్కనే కాలువపై సిమెంటు స్లాబ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది సగం ధ్వంసమైంది. ఈ మార్గంలో విద్యార్థులు, వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రిపూట ఈ దారిలో కొత్తవారు వస్తే ప్రమాదాల బారిన పడాల్సిందేనని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా బాగుచేయాలని కోరుతున్నారు.

'నా సోదరుడి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోండి'

చిత్తూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన సోదరుని ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ నాయకురాలు ఆర్కే శోభారాణి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తన సోదరుడు హరిక్రిష్ణ గత నెల ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఆత్మహత్యకు కారకులైన వారి పేర్లను సూసైడ్ నోట్‌లో రాశాడన్నారు. అందులో ఓ మహిళా కార్పొరేటర్, ఆమె తండ్రి, ఓ వ్యాపారి పేర్లు ఉన్నాయని తెలిపారు. దీనిపై డీఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానన్నారు. అయినా ఇంతవరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంగళరాజుకుప్పంలో టీడీపీ సభ్యత్వ నమోదు



పాలసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పంలో మంగళవారం టీడీపీ కార్యనిర్వాక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు ప్రభాకర్‌రాజు, మోహన్‌రాజు, మాధవరాజు, నవీన్, అరుళ్‌నాథన్ పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌కు సన్మానం



చిత్తూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్‌ను చిత్తూరు రూరల్ మండల టీడీపీ నాయకులు సన్మానించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, గిరి, అను, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు తొలగించండి



నిండ్ర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిండ్ర కొత్త దళితవాడలో మురుగు నిత్యం రోడ్డుపై పారుతోంది. దీనివల్ల అంటువ్యాధులు ప్రబలడంతోపాటు రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

● రైతులకు అధికారుల సూచన

పాలసముద్రం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి సూచించారు. మంగళవారం కృష్ణజిమ్మాపురంలో రెవెన్యూసదస్సు నిర్వహించారు. 20మంది రైతులు అర్జీలు సమర్పించారు. టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణజిమ్మాపురం, శ్రీకావేరిరాజుపురం, వనదుర్గాపురం, సింహరాజుపురం, తిరుమలరాజుపురం పంచాయతీల్లోని డీకేటీభూములకు తమిళనాడు వాసులకు పట్టాలు ఇచ్చారని చెప్పారు. ఫ్రీహోల్డ్‌లో సైతం అవకతవకలు జరిగాయని చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ఐ దేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని కలవగుంట సచివాలయంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. 50 అర్జీలు రాగా ఎక్కువగా మ్యుటేషన్ కోసం వచ్చాయి. డిప్యూటీ కలెక్టర్ వెంకటకృష్ణ అర్జీలు స్వీకరించారు. టీడీపీ మండల అధ్యక్షుడలు రుద్రయ్యనాయుడు, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, సర్పంచ్ రామచంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని తంబుగానిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 15 అర్జీలు అందాయని తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. తంబుగానిపల్లెలోని దారి సమస్యను అర్జీ ఇచ్చిన వెంటనే పరిష్కరించారు. ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పాటూరు పంచాయతీలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ గుర్రప్ప, డీటీ మహేశ్వరి, స్థానిక టీడీపీ నాయకులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.


తంబుగానిపల్లెలో దారి సమస్యను పరిష్కరించిన తహసీల్దార్, సర్వేయర్

సంక్షిప్తంగా..

మంత్రిని కలసిన షణ్ముగం

చిత్తూరు సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి సవితను మాజీటౌన్‌బ్యాంక్ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షణ్ముగం మర్యాదపూర్వకంగా కలిశారు.

నిత్యావసరాల వితరణ

నగరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం, పట్టణ పరిధిలోని ఎయిడ్స్ రోగులకు స్టెప్స్ స్వచ్ఛందసంస్థ ద్వారా నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మకు పూజలు

వెదురుకుప్పం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామదేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకం

వెదురుకుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని కొండపై వెలసి ఉన్న సుబ్రహ్మణ్యంస్వామికి మంగళవారం అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

గుడిపాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుడిపాల పీహెచ్‌సీని మంగళవారం జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. ల్యాబ్, ఓపీ, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో లెప్రసీ కేసులను గుర్తించాలని ఆదేశించారు. డాక్టర్ సంధ్య, వెంకటేష్, కారుణ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించండి

ఐరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని డీఏవో మురళీకృష్ణ అన్నారు. మంగళవారం 35యర్లంపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో భూమితో పాటు వినియోగదారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఉమా, వెటర్నరీ ఏడీఏ పద్మావతి, ఏఈవోలు ద్రాక్షాయణి, ఆనంద్, గణేష్, మాస్టర్‌ట్రైనర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ మాజీ సభ్యురాలి మృతి


సుజాతమ్మ (ఫైల్ ఫొటో)

విజయపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుజాతమ్మ (74) స్వగ్రామమైన జంబాడలో మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం స్వగ్రామంలో దహన క్రియలు నిర్వహిస్తున్నట్టు ఆమె సోదరుడు లక్ష్మీపతిరాజు తెలిపారు.

మా భూమిని ఇప్పించండి

చిత్తూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని ఇప్పించాలని చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన కుప్పయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తన అమ్మ సాలమ్మకు యాదమరి మండలం కుక్కలపల్లెలో 2009లో ప్రభుత్వం ఒక ఎకరా వ్యవసాయ భూమిని మంజూరు చేసిందన్నారు. ఈ భూమిలో పక్కనే ఉన్న ప్రైవేట్ ఫ్యాక్టరీ వాళ్లు రోడ్డువేశారన్నారు. దీనికి ఎటువంటి నోటీసులు, నష్టపరిహారం ఇవ్వలేదని చెప్పారు. ఉన్నతాధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.